కథా కౌముది

# ఎవరికి ఎవరు?

- ఆరేటి కృష్ణ

"సారీ అక్కా!"

ధాత్రి కళ్ళు రెండూ కన్నీటితో నిండిపోయాయి. హర్ష వంటినిండా బాండేజీనే. కళ్ళు, ముక్కు మాత్రమే బయటకి కనిపిస్తున్నాయి. తమ్ముడిని ఇక ప్రాణాలతో చూడలేననీ, ఇదే కడసారి చూపని ధాత్రికి తెలుసు. ఈ వెర్రి కన్నీళ్ళు చూపుకి అడ్డుపడి అతన్ని చూడనివ్వకుండా చేస్తున్నాయి. తనకంటే ఏడాది మాత్రమే చిన్నవాడయిన తమ్ముడు ఎప్పుడూ ఆమెను పేరుతోనే పిలిచేవాడు. తల్లి కోప్పడినప్పుడో, లేక వాడికి బాగా భావోద్వేగం కలిగినప్పుడు మాత్రమే ఆమెని అక్కా అని పిలుస్తాడు.

హర్ష కళ్ళు చుట్టూ వెదికాయి. తల్లికోసం అని గ్రహించింది ధాత్రి.

"బయట ఏడుస్తోంది" అంది ఆమె ఏడవదని తెలిసీ.

"అక్కా! అదితి తెలుసుకదూ!"

అయోమయంగా తల ఊపింది.

గత మూడు సంవత్సరాలుగా ఈ అదితి ప్రస్తావన ఇంట్లో సమస్యని సృష్టిస్తూనే ఉంది.

"నాకు చాలా తక్కువ సమయం ఉంది కదక్కా!"

ధాత్రి మాట్లాడలేదు. గొంతు పెగల్లేదు. కళ్ళ వెంట జలజలా కన్నీరు కారాయి.

"అమ్మ ఇష్ట పడదని తెలుసక్కా! కానీ అదితిని కొంచె... " హర్ష వాక్యం పూర్తి చెయ్యలేదు. పక్కన అసహనంగా నిలబడి ఉన్న నర్సు అచ్చు సినిమా నర్సులా ... అందుకే కాచుకుని కూర్చుని వున్నదానిలా ముఖం మీదికి దుప్పటి లాగేసింది.

నిస్త్రాణగా కాళ్ళీడ్చుకుంటూ బయటకు వచ్చిన ధాత్రిని చూడగానే కాదంబిని అప్పటివరకు ముందుకు వంగి కూర్చున్నదల్లా ఇక వేచి చూడటానికి ఏమీ లేదన్నట్టు వెనక గోడకు ఆనుకుంది నిర్జీవంగా. సూటిగా చూస్తున్న ఆ చూపు ఎటు చూస్తుందో ధాత్రికి తెలియలేదు.

నర్సు మొహమాటపడుతూనే దగ్గరకి వచ్చి, "ఫార్మాలిటీస్..." అని గొణిగింది.

ధాత్రి తల్లివైపు తిరిగి "అమ్మా! ఒక గంట పడుతుంది ఇక్కడే కూర్చో నేను వస్తాను" అంది.

కాదంబిని సమాధానం ఇవ్వలేదు. ధాత్రి ఆశించలేదు కూడా. నర్సు వెనుకే వెళ్ళిపోయింది. లోపలి గదిలో డాక్టరు, పోలీసు ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. ఇద్దరూ చిన్నతనం నుండీ ధాత్రికి తెలిసిన వాళ్ళే. అందుకే శవ పరీక్ష చేయకుండానే చేసినట్టు నివేదిక, మరణ ధ్రువ పత్రం ఇచ్చేశాడు డాక్టరు.

"సారీ ధాత్రీ! అమ్మ జాగ్రత్త. అప్పుడు మీ నాన్న అలా.. ఇప్పుడు వీడు.. ప్చ్" అంటూనే బయటకు వెళ్ళిపోయాడు. ఇన్‌స్పెక్టర్ ఆమె వైపు తిరిగి "ఒకసారి అదితికి ఫోన్ చెయ్యి" అన్నాడు.

"అదితికా?"

"ఊ! ఆ అమ్మాయిని ఇంటిదగ్గర దించి వస్తూండగానే ఈ ప్రమాదం జరిగింది. ఆ పిల్లే నాకు, అంబులెన్స్‌కి ఫోన్ చేసింది.

"తను రాలేదా?"

ఇన్‌స్పెక్టర్ తల అడ్డంగా ఊపాడు.

"వాళ్ళ నాన్న మీ అమ్మకంటే మూర్ఖుడు తెలుసుకదా" ప్రమాదం మీద పెద్దగా ఎంక్వయిరీ, ఇన్వెస్టిగేషన్ వుండకపోవచ్చు. స్పష్టంగా హర్షదే తప్పు. వెనక్కి తిరిగి అదితిని చూస్తూ మలుపులో లారీని ఢీకొట్టాడు. అన్నట్టు నీ కారు తుక్కు తుక్కయింది. ఇన్సూరెన్స్ వస్తుంది కదూ!"

ధాత్రి తల ఊపింది. మనుషులు పుడుతూ ఉంటారు. మరణిస్తూ ఉంటారు. కానీ జరగాల్సినవన్నీ జరిగిపోతూ వుంటాయి. ఎవరికోసమూ, దేని కోసమూ ఆగకుండా.

ఆ సాయంత్రం కృష్ణమోహన్ ఇంటికి వచ్చాడు.

"అంకుల్!" అంటూ ధాత్రి సోఫా నుండి లేచి నిలబడింది. ఆయనకీ ప్రపంచంలో ఎవరూ పట్టరు. ఒక్క కాదంబిని తప్ప.

"సారీ! సారీ!సారీ! కాదంబినీ!"

ఆమె మాట్లాడలేదు. ఆసుపత్రిలో అందరినీ ఎంత అభావంగా చూసిందో అలాగే చూసింది అతని వంక.

ధాత్రి "కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది. ధాత్రికి తెలుసు ఎవరూ లేనప్పుడు కూడా వాళ్ళిద్దరూ పెద్దగా మాట్లాడుకోరు. పదిహేను సంవత్సరాల క్రితం ధాత్రి తండ్రి కూడా కారు ప్రమాదంలోనే పోయాడు. ఆయనకి కార్లంటే పిచ్చి, లేక ప్రేమో! మనం మనుషులని కూడా ఆ విధంగా ప్రేమించలేం. ఈ పిచ్చి లేక ప్రేమ జీన్సులో ఉంటుందేమో తెలియదు. హర్షకి కూడా అదే వెర్రి వ్యామోహం. ఆ వ్యామోహమే ఇవాళ ధాత్రి కొత్తకారు చూడగానే అతన్ని నడపమని ప్రేరేపించింది.

తండ్రి చనిపోయేనాటికి ధాత్రికి పది సంవత్సరాలు. హర్షకి తొమ్మిది. కృష్ణమోహన్ కాదంబనికి కాలేజ్‌లో క్లాసుమేట్. ఆమె అంటే అపరిమితమైన ప్రేమ ఇప్పటికీ. అయితే కాదంబిని ఒక విచిత్రమయిన వ్యక్తి. ఆమె అతన్ని ప్రేమించిందో లేదో తెలియదు. "ప్రపంచంలో రెండు విషయాలుంటాయి కృష్ణా! ఒకటి మనకి ఇష్టమైనది. ఒకటి మనకి మంచిది. మన పెళ్ళి రెండు వైపులా ఎవరికీ ఇష్టంలేదు. అది మనకి మంచిది కాదు" అంది.

"ఇష్టమైనవన్నీ చెడ్డవి కాదుగా కాదంబినీ"

ఆమె దానికేమీ సమాధానం ఇవ్వలేదు. తండ్రి చూసిన విశ్వనాధాన్నే పెళ్ళిచేసుకుంది. అతను ఆమెకంటే దాదాపు పదేళ్ళు పెద్దయినప్పటికీ, కృష్ణ మోహన్లా అందగాడు కాకపోయినప్పటికీ. కృష్ణ మోహన్ షార్ట్ సర్వీసు కమిషన్‌లో మిలటరీలో చేరిపోయాడు. పెళ్ళి చేసుకోలేదు తల్లితండ్రులు ఎంత పోరినా. తరవాత పోరు పెట్టటానికి వాళ్ళిద్దరూ లేరు. పది సంవత్సరాల తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ చేసి సొంత ఊరు వచ్చేశాడు. విశ్వనాధానికి కృష్ణమోహన్ అంటే చాలా అభిమానం వుండేది. ఇద్దరూ కూర్చుని కృష్ణమోహన్ మిలటరీ కాంటిన్ నుండి కొనుగోలు చేసిన మందుని మహా ఆస్వాదించేవారు. కాదంబిని ఏనాడు మోహన్‌ని ఇంటికి రావొద్దని ఆంక్ష పెట్టలేదు. అలాగని అతను వచ్చినప్పుడు సంతోషమూ వెలిబుచ్చలేదు. చాల సాధారణమైన గృహిణిలా వాళ్ళ మందులోకి మంచింగ్ ఏర్పాటు చేసి తను లోపలికి వచ్చి పిల్లలతో కూర్చుని హోం వర్క్ చేయించడమో, టీవీ చూడటమో చేసేది.

అసలు వాళ్ళిద్దరి మధ్యా ప్రేమ వ్యవహారం జరిగిందని ధాత్రికి చాలా సంవత్సరాలు తెలియదు. అంత వయసూ లేదు. ఎప్పుడయినా తండ్రి హాస్యానికి "నిన్ను చేసుకోకుండా కృష్ణమోహన్ బతికిపోయాడు. నేను దొరికిపోయాను" అనేవాడు. ఆమె ఒక్క క్షణం కోపంగా భ్రకుటి ముడివేసి చూసి, అంతలోనే నవ్వేసేది.

తండ్రి కారు ప్రమాదంలో మరణించిన ఏడాది తర్వాత కాబోలు ఒకసారి కృష్ణమోహన్ పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. సాయంత్రం కనుచీకటి పడుతుండగా ధాత్రి ట్యూషన్ నుండి ఇంటికి వచ్చింది. లోపల తల్లీ, కృష్ణమోహన్ లైటు లేకుండా కూర్చుని వున్నారు. అంతక్రితం ఏం మాట్లడుకున్నారో తెలియదు.

"కాదంబినీ! మనం పెళ్ళి చేసుకుందాం. ధాత్రినీ, హర్షనీ నేను నా పిల్లలుగా చూసుకుంటాను" అన్నాడతను.

"వద్దు కృష్ణా! వాళ్ళు నా బాధ్యత" అంది తల్లి గొంతు. ఆమె అతన్ని 'కృష్ణా' అని పిలుస్తుందని ధాత్రికి అప్పటి వరకు తెలియదు.

"ఏంటి నీ మంచివి.. ఇష్టమైనవి.. సిద్ధాంతమా?" అతని గొంతులో నిస్పృహ ఉందేమో తెలియదు. ఆరోపణ మాత్రం లేదు.

చీకటిలో ఆమె నవ్విన సన్నని నవ్వు సుతారంగా మోగింది. తండ్రి చనిపోయాక ఆమె నవ్వటం అదే ప్రధమం. ఒక అరగంట తర్వాత లోపలినుండి ఏ మాటలూ వినపడక బయట హాలులో నిలబడినదల్లా లోపలికి వచ్చింది ధాత్రి.

"ఎంత సేపయిందిరా నువ్వొచ్చి?" అని లేచి లైటు వేసింది కాదంబిని.

ఆమె గొంతులో తొట్రుపాటు లేదు. ఉండదు కూడా. ఆమె ఎప్పుడూ తప్పు చెయ్యదు. ఆ విషయం ఇతరులకంటే ఆమెకే బాగా తెలుసు. అందుకే ఎప్పుడూ అంత నిబ్బరంగానూ వుంటుంది.

"నేను వెళతాను కాదంబినీ" అని అతను లేచాడు.

"మంచిది" అందామె.

పై సంఘటన జరిగిన పదిరోజుల తరువాత ధాత్రి తమ్ముడి చెయ్యి పట్టుకుని తల్లి గదిలోకి వెళ్ళింది.

కాదంబిని ప్రశ్నార్ధకంగా పిల్లల వంక చూసింది.

"అమ్మా! నాకు, హర్షకీ కూడా కృష్ణమోహన్ అంకుల్ అంటే చాలా ఇష్టం" అంది ధాత్రి.

కాదంబరి ఒక్క క్షణం పిల్లల్ని 'పజ్లింగ్'గా చూసింది.

"నాక్కూడా!" అంది చాలా మామూలుగా.

ధాత్రి తమ్ముడి చెయ్యి ఇంకా పట్టుకుని "నువ్వు అంకుల్‌ని పెళ్ళి చేసుకో" అంది గబగబా.

"మీ ఇద్దరికి అతనంటే ఇష్టం కాబట్టి నేను పెళ్ళి చేసుకోవాలా?"

ఆ వయసులో ఏమి సమాధానం చెప్పాలో ధాత్రికి తెలియలేదు.

కాదంబిని ధాత్రిని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది.

"ప్రతి ఇష్టానికి పర్యవసానం పెళ్ళి కానక్కరలేదు" అంది. అంటే ఏమిటో ధాత్రికి అర్ధం కాలేదు.

"పెద్దయ్యాక నీకు అర్ధం అవుతుందిలే" అంది తల్లి.

"పొండి బయటకు పోయి ఆడుకోండి"

అర్థంకాని ఆ వాక్యం ధాత్రికి ఎంత నచ్చిందంటే దాన్ని డైరీలో రాసుకుంది. తర్వాత జీవితంలో దేవానంద్ దగ్గర్నుంచీ తన బాస్ వరకు ఎవరు ఇష్టమైనా ఆ వాక్యాన్ని గుర్తు తెచ్చుకునేది.

ఇనస్పెక్టర్‌కి ఫోను చేసి "అంకుల్ ఇవాళ నేను హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఎప్పుడు వస్తానో తెలియదు. అదితి నెంబర్ నా దగ్గర లేదు. ఒకసారి తనతో నన్ను కలవమని చెప్పగలరా? సాయంత్రం ఆరుగంటలకి కృష్ణ వడ్డుకి రమ్మనండి" అని చెప్పింది.

సాయంత్రం ఆరూ పదికి ధాత్రి వెళ్ళేసరికి అదితి ఎదురు చూస్తూ వుంది. ఆ అమ్మాయి చాలా లావుగా వుండేది. కాదంబినికి ఆమెలో నచ్చని విషయాల్లో అది కూడా ఒకటి. ఇప్పుడు మనిషి చాలా తగ్గింది. ముఖ్యంగా ఆ కళ్ళలో కళ లేదు. మనిషి జబ్బు పడ్డ దానిలా పేలవంగా ఉంది.

"ఒంట్లో బాగోలేదా?"

బానే ఉందన్నట్టు తల ఊపింది.

"మరి?"

"నాకు అబార్షన్ అయ్యింది" అంది చాలా మెల్లగా.

ధాత్రి స్థాణువే అయ్యింది.

తేరుకుని "హర్షా?" అనగలిగింది.

"అవును" అదితి ముడుకుల్లో తల పెట్టుకుని కుళ్ళి కుళ్ళి ఏడిచింది. ధాత్రికి ఏం చెయ్యాలో పాలుపోలేదు.

ఆ అమ్మాయి తలమీద చెయ్యి వేసి నిమురుతూ ఉండిపోయింది. చాలా సేపటి తర్వాత "మంచిదేగా!" అంది తనలో తాను అనుకున్నట్టు.

అదితి తల ఎత్తి "మీరూ అందరిలాగే అంటున్నారా? ఆ బిడ్డని నేను కావాలనుకున్నాను. హర్ష బిడ్డ నాకు కావాలనుకున్నాను" అని మళ్ళీ ఏడిచింది.

"అదితీ! ఎవరికోసమూ ఎవరి జీవితమూ ఆగకూడదు. ధైర్యంగా ఉండు" అని చెప్పి వచ్చేసింది. ఇంటికి వచ్చేసరికి తల్లి గుమ్మంలోనే నిలుచుని ఉంది.

"అదితిని కలిసావు కదూ?"

"అమ్మా! మనం యెంత బాధలో ఉన్నామో తను కూడా అంత బాధలో ఉందమ్మా!"

"అవునా? అందుకేనా పలకరింపుకైనా రాలేదు?"

"రాలేని పరిస్థితి అమ్మా ఆడదానివి అర్థం చేసుకో. అబార్షన్ అయ్యింది తనకి" ధాత్రి చకచకా మెట్లెక్కి తన గదిలోకి వెళ్ళిపోయింది.

అరగంట తర్వాత కాదంబిని ధాత్రి గది గుమ్మం ముందు నిలబడి ఉంది.

"ధాత్రీ ఒక విషయం అడుగుతాను చెపుతావా?"

"అడుగమ్మా!"

"హర్ష బిడ్డేనా?"

ధాత్రి 'అవును' అన్నట్టు తల ఊపింది.

అప్పుడు ఏడిచింది కాదంబిని. హర్ష ఆ క్షణమే చనిపోయినట్టు వెక్కి వెక్కి ఏడిచింది. ధాత్రి గభాలున లేచి తల్లిని వడిలోకి తీసుకుంది. ఎన్నడూ కరగని ఆ మేఘం ఇన్నాళ్ళకు కరిగి నీరయింది. చాలా సేపటివరకు తల్లి బిడ్డయ్యి, బిడ్డ తన తల్లికి తల్లయ్యి అక్కడే కూర్చుండిపోయారు.

రెండు సంవత్సరాల తరవాత ధాత్రి ఒక ముఖ్యమైన సమావేశంలో ఉండగా తెలియని నెంబర్ నుండి ఫోను వచ్చింది.

"హలో!" అంది సమావేశంలోనుండి బయటకి నడుస్తూ.

అవతలి గొంతు నెమ్మదిగా, మృదువుగా "ధాత్రీ నేను అదితిని" అంది.

"వ్వాట్? అదితీ ఎలా వున్నావ్? ఎక్కడున్నావ్? ఇప్పుడు ఎక్కడి నుండి ఫోను చేస్తున్నావ్? చాలా ఎక్సయిటింగ్‌గా ఉంది."

"ఇవాళ సాయంత్రం ఐ టి సి కాకతీయలో డిన్నరు కుదురుతుందా?" అంది అదితి ధాత్రి ప్రశ్నలకి సమాధానం ఇవ్వకుండా.

8 గంటలకి సాయంత్రం ఏమిటి? రాత్రే. ధాత్రి పది నిముషాలు ముందే అక్కడికి చేరుకుంది. మొబైల్‌లో తన రాకని అదితికి తెలియచేసింది.

"దక్షిణ్‌కి వచ్చేయండి" అంది అదితి. అక్కడ ఆరడుగుల అందమైన యువకుడితో, ఏడాది బిడ్డతో కనిపించింది అదితి. భర్తని పరిచయం చేసింది. పేరు ధీరజ్. అపోలో లో కార్డియాక్ సర్జన్.

"కొడుకా?" అంది బిడ్డ వైపు చూస్తూ. తల ఊపుతూనే అదితి సంజాయిషీ ఇచ్చింది.

"పెళ్ళికి పిలవటం కుదరలేదు."

అది పెద్ద విషయం కాదన్నట్టు నోటితో, చేతితో సంజ్ఞలు చేసింది ధాత్రి. హర్ష బిడ్డే అన్నంత ప్రేమతో వాడిని అక్కున చేర్చుకుంది ధాత్రి.

"అవునూ హర్ష విషయం అదితి విషయం ఈ పెద్ద మనిషికి తెలుసా?" అని సందేహం కలిగింది ధాత్రికి.

ఎట్లా అడగటం?

అతని వంక చూసింది. అతను బేరర్ ఇచ్చిన మెనూని ఇసిజి ని చదివినంత శ్రద్ధగా చదువుతున్నాడు.

"బాబు పేరు ఏంటి?"

అదితి నోరు విప్పేలోగానే అతను మెనూలోనుండి తల పైకెత్తాడు. చాలా మామూలుగా "హర్షండీ! మీ తమ్ముడి పేరే" అన్నాడు.

ధాత్రి రెండు కళ్ళు నీటితో నిండిపోయాయి. బిడ్డని గుండెకు హత్తుకుని గట్టిగా ముద్దు పెట్టుకుంది. తన ఆ చర్యతోనే అదితి భర్తకు కృతజ్ఞత చెపుతున్నదానిలా.

COMMENTS